బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 02 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## మానవాళికి మానవత్వం నేర్పిన మహనీయుడు గాంధీ

- సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అహింసనే ఆయుధంగా మలచిన సమరయోధుడు, మానవాళికి మానవత్వం నేర్పిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. స్వాతంత్ర్య పోరాట దిక్సూచి, భరతజాతి మౌలిక స్ఫూర్తి అంతర్జాతీయ సత్యాగ్రహ దినోత్సవంగానూ పాటించే జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ ఆదర్శమూర్తికి రేవంత్ రెడ్డి ఘననివాళులు అర్పించారు.

# మూసీ కూల్చివేతలు షురూ..!

- వీధులు ఇరుకుగా ఉండటంతో క్రేన్‌లు, బుల్డోజర్లు రావడానికి ఇబ్బంది..
- అడ్డా కూలీల సహాయంతో కూల్చివేతలు
- నిర్వాసితుల సామాన్లు తరలింపునకు వాహనాలు ఏర్పాటు
- డబుల్ బెడ్ రూం ఇండ్లకు నిర్వాసితుల తరలింపు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నదీపరీవాహక ప్రాంతంలోని ఇండ్లను మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ కూల్చివేసింది. మలక్‌పేట నియోజకవర్గంలోని చాదర్‌ఘాట్‌లో గల శంకర్ నగర్, వినాయక వీధి, రసూల్ పుర, మూసానగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచే కూల్చివేతలు ప్రారంభించారు. స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్లను నేలమట్టం చేశారు. ఇరుకు సందులు కావడంతో బుల్డోజర్లు వెళ్లే పరిస్థితి లేక కూలీలను పెట్టి పని చేయిస్తున్నారు. నిర్వాసితులను ఇప్పటికే చంచల్‌గూడ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి తరలించారు. మరికొంతమంది నిర్వాసితులను తరలించేందుకు, ఇళ్లల్లోని సామగ్రి తీసుకెళ్లేందుకు అధికారులు వాహనాలను ఏర్పాటు చేశారు. వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు ఆయా ప్రాంతాలకు వచ్చి కూల్చివేతల ప్రక్రియను పరిశీలిం చారు. చిన్నచిన్న ఘటనలు మినహా... ఇండ్ల తొలగింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది.

మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా రివర్ బెడ్ పరిధిలో సుమారు 55 కి.మీ పరిధిలో 40 వేల ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. చాదర్‌ఘాట్ మూసీ పరీవాహక ప్రాంతాల్లోని మూసానగర్, రసూల్‌పుర, వినాయక్‌నగర్ పరిసరాల్లో ఇళ్లకు రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేశారు. ఇందులో ప్రస్తుతం స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్ల కూల్చివేతను ప్రారంభించారు.

ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపైన RB-X అని పెద్ద అక్షరాలతో పెయింట్ వేసిన విషయం తెలిసిందే. కొంతమంది బాధితులు మాత్రం అధికారులపై తిరగబడ్డారు. ఈ నేపథ్యంలో అధికారులు మాత్రం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామంటూ కూడా హామీ ఇచ్చారు. ఈక్రమంలోనే.. పోలీసుల భద్రతల మధ్య కూల్చివేతలు ప్రారంభమయ్యాయి.

ఇక నాంపల్లి, మలకపేట్ మండలాల పరిధిలో మొత్తం 174 కుటుంబాలకు ఇప్పటి వరకు అధికారులు డబుల్ ఇండ్ల పట్టాలను అందజేసిన విషయం తెలిసిందే. వీరిలో శంకర్ నగర్, మూసానగర్, వినాయక వీధి, రసూల్ పురా ప్రాంతం నుంచి 133 మంది పిల్లిగుడిసెలలో ఉన్న డబుల్ ఇండ్లకు, మరో 16 కుటుంబాలను ప్రతాపసింగారంలో ఉన్న డబుల్ ఇండ్లకు వెళ్లారు. నాంపల్లి మండలం నుంచి ఇప్పటికే 15 మంది జియాగూడ డబుల్ ఇండ్లకు వెళ్లగా, మంగళవారం చంద్రకిరణ్ బస్తీకి చెందిన మరో పది కుటుంబాలు తరలివెళ్లాయి. వివిధ కారణాలతో మరో నాలుగైదు కుటుంబాలు ఎలాటి నిర్ణయం తీసుకోలేదని అధికారులు వివరించారు.



## బతుకమ్మ శుభాకాంక్షలు

- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనం అన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ అందరూ కలిసి పండుగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కష్టాలను తొలగించాలని గౌరమ్మను సీఎం ప్రార్థించారు.

## గ్రీన్ హైడ్రోజన్ హబ్ గా మారనున్న తెలంగాణ

- ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క

వివరాలు 3వ పేజీలో



## బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలి

- మాజీ సీఎం కేసీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతీ సాంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, రాష్ట్ర సాధనకోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందన్నారు.

ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ సందర్భంగా పల్లెలు పట్టణాలు అనే బేధం లేకుండా మహిళలతో పిల్లాపాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బతుక మ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని గుర్తు చేశారు. మహి ళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను అందజేసిన విషయాన్ని గుర్తుచేసు కున్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను ఆటాపాటలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని, తెలంగాణ ఆడబిడ్డలను కోరారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతి మాత బతుకమ్మ వెలుగులు నింపాలని ప్రార్థించారు కేసీఆర్.

## బఫర్ జోన్‌ను నిర్ణయించింది బీఆర్ఎస్సే



- మంత్రి శ్రీధర్ బాబు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మూసీ ప్రక్షాళనపై విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మంత్రి హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. మూసీలో అక్రమ కట్టడాలు గుర్తిం చాలని గతంలో కేసీఆర్ ఆదేశించలేదా అని ప్రశ్నించారు. మూసీని కాలుష్య రహితంగా చేయాలని కేసీఆర్ చెప్పలేదా అని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన పనులు మర్చిపోయినట్లున్నారని సెటైర్లు వేశారు. 2021లో మూసీపై కేసీఆర్ ప్రభుత్వం సమావేశాలు పెట్టిందని తెలిపారు. మూసీకి 50 మీటర్ల దూరంలో బఫర్ జోన్‌ను నిర్ణయించారన్నారు. మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలోనే మూసీకి సరిహద్దులను ఫిక్స్ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకని బీఆర్ఎస్ వాళ్లు ప్రశ్నిస్తున్నారని అన్నారు.

### భారీగా పెరిగిన
## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.48.50 మేర పెరిగింది. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మంగళవారం ఉదయం ప్రకటించాయి. పెరిగిన ధరలు అక్టోబర్ 1 నుంచే అమల్లోకి రానున్నట్లు వెల్లడించాయి.ధరల పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,691 నుంచి రూ.1740కి పెరిగింది. కోల్‌కతాలో రూ.1,802 నుంచి రూ.1,850.50కి, ముంబైలో రూ.1,644 నుంచి రూ.1,692.50కి, చెన్నైలో రూ.1,855 నుంచి రూ.1,903కి పెరిగాయి. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. కాగా అంతకుముందు సెప్టెంబర్ 1, ఆగస్టు 1న కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను కంపెనీలు పెంచాయి.ఇక 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదని, పాత ధరలే యథాతథంగా కొనసాగుతాయని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా ఇవాళ కూడా సవరించిన ధరలను ప్రకటించాయి.

## ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు 10 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ (మంగళవారం) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేసింది.

**స్పెషల్ ఆఫీసర్లు వీరే !**

**హైదరాబాద్ -ఆమ్రపాలి,**
**రంగారెడ్డి- దివ్య,**
**మహబూబ్‌నగర్- రవి,**
**నల్లగొండ- అనితా రామచంద్రన్,**
**వరంగల్- టీవీ కృష్ణారెడ్డి,**
**మెదక్- దాసరి హరిచందన,**
**నిజామాబాద్- ఏ.శరత్,**
**ఆదిలాబాద్- ఇలంబరితి,**
**కరీంనగర్- ఆర్వీ కర్ణన్,**
**ఖమ్మం- సీఎస్ కె.సురేంద్రమోహన్** కు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## నేటి నుంచి దసరా సెలవులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. నేటి (బుధవారం) నుంచి ఈ నెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించగా 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కాగా, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు దసరా సెలవులు తప్పనిసరిగా ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో రాడార్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా దామగుండం అటవీ పరిరక్షణ సమితి జేఏసీ రూపొందించిన సేవ్ దామగుండం సీడీని ఆవిష్కరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

## హైదరాబాద్ ప్రజలపై పగబట్టిన సీఎం



- పేదలు చేసిన తప్పేంటి..?
- మీకు ఓటు వేయపోవడమేనా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గోల్నాకలో మూసీ ప్రాంత వాసులకు పరామర్శ
- కేటీఆర్ కారును అడ్డుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారని, గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. హైదరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు.

అనంతరం మూసీ కూల్చివేతల బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పెన్షన్లు రూ.4వేలు చేస్తా అన్నాడు. ఆరు గ్యారెంటీలు ఇస్తా అన్నాడు. ఏమీ ఇవ్వలేదు అన్నారు. ఇక్కడ 38 ఇండ్లకు రంగులు వేసాడట.

మిగితా 3వ పేజీలో

## వరద ప్రభావిత రాష్ట్రాలకు నిధుల విడుదల..

### తెలంగాణకు రూ. 416.80 కోట్లు ఏపీకి 1036 కోట్లు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల చేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన 14 రాష్ట్రాలకు మొత్తం రూ. 5,858.60 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ. 416.80 కోట్లు విడుదల చేయగా, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1036 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు నిధికి ఎన్డీఆర్ఎఫ్ నుంచి కేంద్రవాటా నిధులు విడుదలయ్యాయి. అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 1432 కోట్లు విడుదలయ్యాయి.

త్వరలోనే మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే మహారాష్ట్రకు భారీగా నిధులు విడుదల చేసినట్టు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**రాష్ట్రాలకు దక్కిన నిధులు**

మహారాష్ట్రకు రూ.1,492 కోట్లు
ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లు
అస్సాంకు రూ.716 కోట్లు
బీహార్‌కు రూ.655.60 కోట్లు
గుజరాత్‌కు రూ.600 కోట్లు
హిమాచల్ ప్రదేశ్‌కు రూ.189.20 కోట్లు
కేరళకు రూ.145.60 కోట్లు
మణిపూర్‌కు రూ.50 కోట్లు
మిజోరాంకు రూ.21.60 కోట్లు
నాగాలాండ్‌కు రూ.19.20 కోట్లు
సిక్కింకు రూ.23.60 కోట్లు
తెలంగాణకు రూ.416.80 కోట్లు
త్రిపురకు రూ.25 కోట్లు
పశ్చిమ బెంగాల్‌కు రూ.468 కోట్లు

## మత విశ్వాసాల కంటే ప్రజల భద్రతే ముఖ్యం..

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల భద్రతే ముఖ్యం తప్ప.. మత విశ్వాసాలు కాదని దేశ అత్యున్నత న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. భారతదేశం లౌకిక దేశమని గుర్తుచేస్తూ రోడ్లు, రైల్వేట్రాక్‌లు ఆక్రమించిన ఆలయాలు, దర్గాలు, గురుద్వారాలు.. ఏ మతానికి చెందిన కట్టడాలైనా సరే తొలగించాల్సిందేనని తేల్చిచెప్పింది. ప్రజల భద్రత విషయంలో రాజీ ధోరణి ఎట్టి పరిస్థితుల్లోనూ కూడదని వివరించింది. బుల్డోజర్ జస్టిస్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం ఈ వ్యాఖ్యలు చేసింది.న్యాయపరంగా అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా కూల్చివేతలను నిషేధిస్తూ మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

'మనది లౌకిక దేశం. మతం, వర్గాలకు అతీతంగా అందరికీ దిశ ఉంటుంది. మార్గమధ్యంలో ఏదైనా మతపరమైన నిర్మాణాలు ఉంటే.. అది గురుద్వారా అయినా.. దేవాలయమైనా కావొచ్చు. అది ప్రజలను అడ్డుకోదు' అని ధర్మాసనం పేర్కొంది. కూల్చివేతలకు సంబంధించిన నోటీసులు, ఉత్తర్వులు మరింత పారదర్శకంగా ఉండేలా డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవచ్చని కోర్టు చెప్పింది. పబ్లిక్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వేలైన్లు, నీటి వనరుల ఆక్రమించిన ప్రాంతాల్లో కూల్చివేతలపై సెప్టెంబర్ 17న సుప్రీంకోర్టు అక్టోబర్ ఒకటి వరకు నిషేధం విధించిన విషయం తెలిసిందే.

ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్, గుజరాత్ ప్రభుత్వాల తరపున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఒకటి, రెండు సంఘటన ఆధారంగా న్యాయస్థానం ఓ అంచనాకు రావొద్దని.. కూల్చివేతలపై మొదట నోటీసులు జారీ చేస్తున్నామని.. అక్రమ కట్టడాలని తేలాకే

మిగితా 3వ పేజీలో

# సిరిసిల్లలో ఎటువంటి సంక్షోభం ఉండవద్దు

- నేత కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ తోడ్పాటు..
- ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను నేత కార్మికులు వినియోగించుకోవాలి
- పిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్లలో ఎటువంటి సంక్షోభం ఉండవద్దని ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఉన్నారని, నేత కార్మికులు ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ నేత కార్మికుల సంక్షేమం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, నూలు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. మంగళవారం వేములవాడ లో పర్యటించిన రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్ లు స్వాగతం పలికారు. అనంతరం వేములవాడలో నేత కార్మికుల సమస్యలు , వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, పెండింగ్ బకాయిలు, ఆర్డర్లు తదితర అంశాల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ నేత కార్మికులు ఆర్దికంగా స్వతంత్రంగా ఎదగాలని, దీనికి అవసరమైన సంపూర్ణ తోడ్పాటు ప్రభుత్వం అందిస్తుందని, ద్వారా నేత కార్మికులకు లాభం చేకూరుతుందని అన్నారు. పెండింగ్ బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించామని, మిగిలిన బకాయిలు ఉంటే వాటి చెల్లింపుకు చర్యలు తీసుకుంటా మని, తెలంగాణలోని మహిళ సంఘాలకు 2 చీరల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందని, దీని ద్వారా నేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

తెలంగాణ సాంస్కృతి, చరిత్రను ప్రతిభంబించేలా మహిళా సంఘాల కు యూనిఫాం విధంగా ఆ చీర ఉండాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని, దానికి కొత్త బ్రాండ్ ఇమేజ్ రావాలని అన్నారు. మహిళా గ్రూపులతో, చేనేత పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడామని , పాలిస్టర్ చీర జరీ అంచు ఉంటుందని అన్నారు. ఆధునికంగా ఉండే విధంగా చీరలు తయారు చేయాలని సీఎం ఆదేశించారని,

సిరిసిల్ల జిల్లాలో స్వతంత్రంగా ఆ చీరలు తయారు చేసే అవకాశం కల్పించాలని ఆసాములు కోరడంతో ప్రభుత్వం ఈ సమావేశం ఏర్పాటు చేసి దానికి తగిన విధంగా చర్యలు చేపట్టిందని,నూలు డిపో పెట్టిన తర్వాత దాని తరలింపు బాధ్యత ఆసాముల దేనని అన్నారు.

సొసైటీకి నూలు అప్పగించిన తర్వాత లాభాలను సేట్లు, ఆసాములు, వర్కర్లు ఎలా తీసుకుంటారు అనే అంశాలను వివరించాలని అన్నారు. ప్రస్తుతం వచ్చే లాభం అధికంగా ఆసాములకు చేరాలని ప్రభుత్వం భావిస్తుందని,100% దీని పైన ఆధారపడ కుండా ప్రైవేట్ మార్కెట్ లో కూడా చేనేతలు రాణించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. హైదరాబాద్ లో కోఠి,బేగం బజార్ ప్యారడైస్ చుట్టు పక్కల ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ సూరత్ నుంచి తెచ్చి ప్రింటింగ్ చేస్తున్నారని, మన సిరిసిల్ల చేనేతలు అవకాశాలు అంది పుచ్చుకోవాలని , అవకాశాలను చేనేతలు అందుపుచ్చుకోవాలని అన్నారు.



ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత రంగంలో అనుభవం కలిగిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక శ్రద్ధ వహించి సిరిసిల్ల జిల్లా పరిధిలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని అన్నారు. చేనేత సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, గత ప్రభుత్వం పెట్టిన 190 కోట్ల బకాయిలను విడుదల చేశారని అన్నారు.టెస్కో జీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త పథకాల వల్ల దీర్ఘకాలంలో నేత కార్మికులకు లాభం చేకూరుతుందని అన్నారు. గతంలో కేవలం వైట్ క్లాత్ మాత్రమే తయారు చేశారని, అక్కడి నుంచి పీసీ, కలర్, జరీ అంచు చీరలు, జకాడ్ క్రమక్రమంగా మార్పు సాధించామని, ఈ మార్పు ఇంకా ముందుకు తీసుకొని వెళ్లాలని అన్నారు.

నేత కార్మికులు సొంత కాళ్ళ మీద నిలబడాలని అన్నారు. సంఘ అధ్యక్షులకే కాకుండా ఆసాములకు కూడా లాభం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. టెస్కో అందించే ఆర్డర్లను చేస్తూనే ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను చేనేతలు అందిపుచ్చుకోవాలని , హైదరాబాదులో ప్రతిరోజు లక్షల మీటర్ల ఆర్డర్లు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని, వీటిని చేనేతల సాధించాలని అన్నారు.

ఆసాములు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన అవకాశాలను వాడుకుంటామని వచ్చే లాభాలను సంఘంలోని సభ్యులంతా సమానంగా పంచుకుంటామని, నూలు డిపో ఏర్పాటు వల్ల మంచి జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఆ సమయంలో తమ వద్ద పని చేసే కార్మికులకు సైతం లాభం చేకూరుస్తామని అన్నారు. ఈ సమవేశం లో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, టెస్కో జీఎం అశోక్ రావు, ఏడీ హ్యాండ్లూమ్స్ సాగర్, నేత కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రజనీకాంత్‌కు అస్వస్థత

- రజనీకాంత్‌కు స్టెంట్ వేసిన వైద్యులు..

**బలగం టీవీ , చెన్నై**

సూపర్ స్టార్ రజనీకాంత్ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం అర్ధరాత్రి ఆయనకు కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్యుల బృందం సూపర్‌స్టార్‌కు చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యులు తలైవాకి చిన్నపాటి సర్జరీ చేశారు. అనుభవగ్నులైన ముగ్గురు వైద్యులు రజనీకాంత్‌కు పొత్తికడుపు కింది భాగంలో స్టెంట్ వేశారు ఈ ప్రక్రియ విజయవంతమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. రెండు లేదా మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఇక తలైవా రజనికాంత్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



# గోవిందా ఇంట్లో గన్ మిస్‌ఫైర్..



**బలగం టీవీ , ముంబై**

బాలీవుడ్ నటుడు గోవిందా ఇంట్లో గన్ మిస్‌ఫైర్. అయ్యింది. ఈ ఘటనలో గోవిందా కాలిలోకి బుల్లెట్ దూసుకెళ్లి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నటుడిని హుటాహుటిన ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.మంగళవారం తెల్లవారుజామున 4:45 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గోవిందా బయటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న క్రమంలో తన వద్ద ఉన్న లైసెన్స్ గన్‌ను తనిఖీ చేస్తుండగా.. అది ఒక్కసారిగా మిస్‌ఫైర్ అయ్యింది. అందులోని బుల్లెట్ గోవిందా కాలులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నటుడు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన అతడిని ముంబైలోని క్రిటీ కేర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం గోవిందా ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.



# జమ్మూకశ్మీర్‌లో పోలింగ్ ప్రశాంతం..

- 65.65 శాతం ఓటింగ్ నమోదు

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తుది విడత పోలింగ్ మంగళవారం ముగిసింది. రికార్డు స్థాయిలో 65.65 శాతం పోలింగ్ నమోదైంది. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా పోలింగ్ ముగిసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తుది విడత పోలింగ్‌లో భాగంగా 40 సీట్లలో పోలింగ్ జరుగగా, 24 సీట్లు జమ్మూలోనూ, 16 సీట్లు కాశ్మీర్‌లోనూ ఉన్నాయి. అత్యధికంగా సాంబ జిల్లాలో 75.43 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా బారాముల్లాలో 55.73 శాతం పోలింగ్ నమోదైంది.పోలింగ్‌కు ముందు ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న ప్రజాస్వామ్య పండుగలో (ఎన్నికల్లో) పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొనాలని పిలుపునిచ్చింది. అందుకు అనుగుణంగా గణనీయంగా ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలి వచ్చారు. మూడు విడతల పోలింగ్‌లో భాగంగా తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరుగగా, 65.52 శాతం పోలింగ్ నమోదైంది. సెప్టెంబర్ 25న జరిగిన రెండో విడత పోలింగ్‌లో 57.31 శాతం పోలింగ్ నమోదైంది. అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు.

# తల్లిని చంపి ఫ్రై చేసుకు తిన్న కొడుకు..!



- ఉరిశిక్ష విధించిన బాంబే హైకోర్టు

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

కన్నతల్లిని చంపి ఆమె శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా నరికి 'ఫ్రై' చేసుకుని తిన్న కసాయి కొడుకుకు కొల్హాపూర్ కోర్టు విధించిన ఉరిశిక్షను బాంబే హైకోర్టు ఖరారు చేసింది. 2017లో జరిగిన ఈ ఘటనను 'నరమాంస భక్షణ' కేసుగా గుర్తిస్తూ హైకోర్టు శిక్షను ఖరారు చేసింది. ఈ కేసులో దోషిగా తేలిన సునీల్ కుచ్కోరవి అనే వ్యక్తిని మార్చే అవకాశం ఎంతమాత్రం లేదని, అతనికి విధించిన ఉరిశిక్షను ఖాయం చేస్తున్నామని న్యాయమూర్తులు రేవతి మొహితె, పృథ్వీరాజ్ చవాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది.


'మేం ఈ కేసును అత్యంత అరుదైన కేసుల్లో ఒకటైన 'నరమాంస భక్షణ' కేసుగా పరిగణిస్తున్నాం. దోషి తన తల్లిని హత్య చేయడమే కాదు, ఆమె శరీరం నుంచి మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం, పేగులు లాంటి కీలక అవయవాలను వేరుచేసి వాటిని పాన్‌లో ఉడికించి తిన్నాడు. ఇది నరమాంస భక్షణ కిందకు వస్తుంది. ఇలాంటి ధోరణులు ఉన్నవారిని మార్చే అవకాశం లేదు. ఒకవేళ జైలు శిక్ష విధిస్తే జైలులో కూడా ఇదే తరహా నేరం చేసే అవకాశం ఉంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం.. కొల్హాపూర్ సిటీలో 2017 ఆగస్టు 28న ఈ పాశవిక హత్య జరిగింది. 63 ఏళ్ల వృద్ధురాలైన యల్లమ్మ రామ కుచ్కోరవిని అత్యంత పాశవికంగా సునీల్ హత్య చేశాడు. ఆమె శరీర భాగాలను ముక్కలుగా నరికి పాన్‌లో ఫ్రై చేసుకుని తిన్నాడు. మందు తాగడానికి యల్లమ్మ డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ ఘాతుకానికి అతను పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుడికి 2021లో కొల్హాపూర్ కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఆ వెంటనే ఎరవాడ జైలుకు (పుణె) అతడిని తరలించారు. తనకు విధించిన మరణశిక్షను రద్దు చేయాలని కోరుతూ సునీల్ కుచ్కోరివి హైకోర్టులో సవాల్ చేశాడు. హైకోర్టు అతని అభ్యర్థనను తోసిపుచ్చింది.

# టాటా గ్రూప్‌లోని రెండు ఎయిర్‌లైన్స్ విలీనం..

## ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో కలిసిన ఏఐఎక్స్ కనెక్ట్

**బలగం టీవీ , న్యూఢిల్లీ**




టాటా గ్రూప్‌లోని విమానయాన సంస్థల్లో రెండు విమానయాన సంస్థలు విలీనమయ్యాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ విలీన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించింది. అక్టోబర్ 1 నుంచి ఏఐఎక్స్ కనెక్ట్ కింద నమోదైన విమానాలన్నీ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పేరుతో నడవనున్నాయి.విలీన ప్రక్రియ పూర్తికావడంతో విలీనం అనంతర కార్యకలాపాలను పరిశీలిస్తామని డీజీసీఏ తెలిపింది. అదేవిధంగా ఎయిరిండియా - విస్తారా విలీన ప్రక్రియ జరుగుతోందని పేర్కొంది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఏఐఎక్స్ కనెక్ట్.. ఈ నాలుగు టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థలే. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్‌ను, ఎయిరిండియాలో విస్తారాను విలీనం చేయాలని టాటా గ్రూప్ నిర్ణయించింది. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తయ్యింది.



# మళ్లీ బ్యాట్ పట్టనున్న సచిన్..

**బలగం టీవీ , ముంబై**

దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మరోసారి మైదానంలోకి దిగనున్నాడు. తొలి ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్)లో అతడు బరిలో దిగనున్నాడు. ఆరు జట్ల ఈ టీ20 టోర్నీ త్వరలో దేశంలోని మూడు వేదికల్లో జరగనుంది. భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లండ్, శ్రీలంక క్రికెటర్లు పాల్గొనే ఐఎంఎల్ ముంబై, లఖ్‌నవూ, రాయ్‌పూర్‌లో నిర్వహించనున్నారు. టెండూల్కర్, మాజీ కెప్టెన్ గవాస్కర్ ఈ లీగ్‌కు రూపకల్పన చేశారు. గవాస్కర్ ఐఎంఎల్‌కు కమిషనర్‌గా వ్యవహరించనున్నాడు.

సచిన్ టెండూల్కర్ మాట్లాడుతూ "క్రికెట్ కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణను పెంచుకుంటూనే ఉంది. గత దశాబ్దంలో, టీ20 క్రికెట్ దాని స్వీకరణను వేగవంతం చేసింది మరియు కొత్త అభిమానులను ఆటలోకి ఆకర్షించింది. ఇప్పుడు వయస్సులో ఉన్న అభిమానులలో బలమైన కోరిక ఉంది. కొత్త ఫార్మాట్‌లలో పాత పోరాటాలకు తిరిగి సాక్ష్యం చెప్పండి, క్రీడాకారులు ఎప్పుడూ విరమించుకోరు, మరియు పోటీ పరంపర, మేము అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్‌ని ఉద్వేగభరితమైన అభిమానుల సమావేశ స్థానంగా భావించాము క్రికెటర్లు.. మన దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఆటగాళ్లందరూ తిరిగి పోటీకి సిద్ధమవుతారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను.

సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ, "టీ20 క్రికెట్ యొక్క ఎదుగుదల మనం ఇష్టపడే క్రీడ యొక్క మాయాజాలాన్ని పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ తమ హీరోలను ప్రత్యక్షంగా ప్రత్యక్షంగా చూసేందుకు మరో సువర్ణావకాశాన్ని అందిస్తూ, కొన్నేళ్లుగా వారు ఆరాధిస్తున్న లెజెండ్‌లకు అభిమానులను దగ్గర చేస్తుంది. ఇది కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదుఇది నాస్టాల్జియా యొక్క వేడుక, ఇక్కడ క్రికెట్ అద్భుతం యొక్క మరపురాని క్షణాలు మరోసారి సజీవంగా వస్తాయి. ఈ ఉత్తేజకరమైన ప్రయాణంలో మాతో చేరాలని మరియు కలిసి కొత్త జ్ఞాపకాలను సృష్టించుకోవాలని మేము ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాము.




# రూ.2.80 కోట్ల గంజాయి దగ్ధం

**బలగం టీవీ , ఖమ్మం**

ఖమ్మం జిల్లాలో భారీగా గంజాయిని ఎక్సైజ్ అధికారులు దగ్ధం చేశారు. వివరాల్లోవెళ్తే .. జిల్లాలోని ఆరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 72 కేసుల్లో పట్టుకున్న 1120 కేజీల గంజాయిని ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం దగ్ధం చేశారు. ఎవరైనా గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత గంజాయి వంటి అన్ని రకాల మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# మాలల ఐక్యవేదిక తాడూరు గ్రామ శాఖ కమిటీ ఎన్నిక



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా మాలల ఐక్యవేదిక కన్వీనర్ తుంగ శివరాజ్, కో కన్వీనర్లు నాలుక సత్యం, బూర యాదగిరి, బొల్లం గణేష్,రోడ్డ రామచంద్రం జిల్లా సభ్యులు బిజిగా కిష్టయ్య, మండల అధ్యక్షులు మీసా ప్రేమ్ సాగర్, మీసా సుధీర్,లింగం, ప్రవీణ్ ల ఆధ్వర్యంలో తాడూరు గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా అచ్చ దేవరాజ్, సారుగు లక్ష్మణ్,రెడ్డి మల్ల సత్యం, మీసా అంజయ్య, బత్తుల సుధాకర్, రెడ్డి మల్ల కిరణ్ తేజ, రెడ్డి మల్ల కొండయ్య,బత్తుల రాజయ్య, మీసా చైతన్య, ఎర్రోళ్ల సతీష్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాలల ఐక్యతకు పాటు పడతామని దీనికి సహకరించిన తాడూరు మాల సంఘ సభ్యులందరికీ నూతనంగా ఎన్నికైన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాలి నడకన తిరుమల చేరుకున్న పవన్ కల్యాణ్



**బలగం టీవీ , తిరుమల**

అంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఇటీవల తిరమల లడ్డూ కల్తీ నేపథ్యంలో ప్రాయశ్చిత దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఆ దీక్ష విరమించేందుకు గాను మంగళవారం సాయంత్రం స్వయంగా నడుచుకుంటూ అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరుకున్నారు. అయితే కాలు నొప్పి కారణంగా ఆయన మెట్లు ఎక్కేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దీంతో నడిచే సమయంలో మధ్యలో రెండు మూడు సార్లు కొంత సేపు మెట్ల మీదే విశ్రాంతి తీసుకున్నారు. ప్రస్తుతం తిరుమల చేరుకున్న పవన్ ఈ రాత్రికి అక్కడే బస చేయసి. రేపు (బుధవారం) ఉదయం తిరుమల వెంకన్నను దర్శించుకున్న అనంతరం ప్రాయశ్చిత దీక్షను విరమించనున్నారు.



# థాయ్‌లాండ్‌లో మంటల్లో చిక్కుకున్న స్కూల్ బస్సు..

- 25 మంది మృతి ..!

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

థాయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న బస్సు మంటల్లో చిక్కుకుంది. ఈ దుర్ఘటనలో సుమారు 25 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. థాయ్‌లాండ్ నేషన్ ప్రకారం.. ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్ కోసం ఉథాయ్ థాని ప్రావిన్స్‌కు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న బస్సు ముందు టైర్ పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పమాద సమయంలో బస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొత్తం 44 మంది ఉన్నట్లు సదరు మీడియా నివేదించింది. ఈ ఘటనలో 25 మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంచనా వేసింది. అధికారులు రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపింది. బ్యాంకాక్ ఉత్తర శివారు ప్రాంతమైన పాతుమ్ థాని ప్రావిన్స్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు రవాణా మంత్రి సూర్యా జుంగ్రుంగ్రూంగ్‌కిట్ తెలిపారు.

# హైదరాబాద్ ప్రజలపై పగబట్టిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

ఏ ఇంటికి కష్టం వచ్చినా పక్కింటి వాళ్ళు అడ్డుకోవాలి. బుల్డోజర్‌ను బొంద పెట్టాలని చెప్పారు. గంగా నది ప్రక్షాళన కోసం 2400 కిలోమీటర్లు ఉన్న ప్రాజెక్ట్ రూ. 20 వేల కోట్లతో కేంద్రం చేపట్టింది. కానీ మూసి నదికి లక్షా 50 వేల కోట్లతో శుద్ధి చేస్తానన్న పేరుతో దోచుకోవడానికి రేవంత్‌రెడ్డి చూస్తున్నాడని ఆరోపించారు.

పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. మీకు కష్టం వస్తే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు అండగా ఉంటున్నారని తెలిపారు. కానీ మీ ఓట్లతో గెలిచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గల్లీలో తిట్టుకుంటూ ఢిల్లీలో రేవంత్ రెడ్డి,కిషన్ రెడ్డి ఒకటై పేదల ఇండ్లను కూల్చడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత సొమ్మును ఢిల్లీకి తాకట్టు

పెట్టడానికి ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. మీకోసం బీఆర్ఎస్ తరపున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు.

'తెలంగాణల పెద్ద పండుగ అంటే దసరా. కానీ హైదరాబాద్‌లో లక్షలాది మంది పేదలకు నిద్రలేకుండా చేసింద్రు. ఎప్పుడు ఇండ్లు కూలగొడుతరో, ఎప్పుడు తమ ఇంటి మీదికి బుల్డోజర్ పంపుతరో అన్నట్లు భయపడు తున్నరు. మన హక్కులు మనం తెలుసుకున్నప్పుడు.. ఏ ప్రభుత్వం కూడా ఇష్టం వచ్చినట్లు మనమీదికి రాదు. హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డి ఎవరూ ఓట్లు వేయలే. అందుకే ఇక్కడి ప్రజలపై పగబట్టిండు. అన్నారు.

రైతులకు రూ.15 వేలు ఇస్తానన్నడు. ఇచ్చిండా. ఆరు గ్యారంటీలు.. నూరు రోజులు అన్నడు. మూడొందల రోజులైంది. ఒక్కరికన్నా బుడ్డ పైసా అన్న వచ్చిందా. హామీలకు సంబంధి ఒక్క పైసా ఇవ్వలేదు. మూసీని రూ.లక్షా 50 వేల కోట్లతో సుందరీకరించి లండన్ లెక్క చేస్తాడట. ఇక్కడున్న పేదలను అడవిల పడేస్తాడట. మనమంతా చూస్తూ ఊరుకుందామా అని అన్నారు.

"ఇందిరమ్మ రాజ్యం అన్నరు. ఇందిరమ్మ చెప్పిందా.. సోనియమ్మ చెప్పిందా ఇండ్లు కూలగొట్టమని?. ఇందిరమ్మ ఇండ్లు కడతమ న్నరు. ఇప్పుడు ఇండ్లు కూలగొతమంటున్నరు. ఇక్కడున్న ఇండ్లను కూలగొట్టి హొటల్ కడుతా, పార్కులు కడతా అంటే ఎవరికోసం?. గవర్నమెంట్లకు రాకముందు నల్లబిల్లులు కడుతా, కరెంటు బిల్లులు కడుతా అన్నడు. ఎప్పుడన్నా చెప్పిండా ఇండ్లు కూలగొడుతా అని. ఇండ్లు కూలగొడుతా అంటే ఓట్లు పడుతుండెనా?.

ఇయ్యాల ఒక్క అంబర్‌పేట నియోజకవర్గంలోనే 16 వందల కుటుంబా లను రోడ్లపై పడేస్తున్నరు. కానీ బయటికి చెప్పే లెక్కలు వేరున్నయ్. లోపల అలగున్నయ్. సుమారు 40 వేల కుటుంబాలను అంటే లక్షన్నర మందిని రోడ్లమీద పడేసే ప్రయత్నం ఈ మూసీ ప్రాజెక్టు. ఎవడడిగిండు అసలు ఈ మూసీ ప్రెజెక్టును. గరీబోళ్లకు రూ.2500 ఇస్తాన్నవ్ అది ఇవ్వు. బతుకమ్మ చీరలు రెండిస్తా అన్నవ్. ఒక్కటీకూడా లేదు. రేవంత్ రెడ్డిని నమ్ముకుంటే ఒక్కటి కూడా ఉండవ్. గరీబోళ్లకు పనిచేయమని గద్దెనెక్కిస్తే.. ఇవాళ పేదోళ్ల ఇండ్లు కూలగొడుతా.. రోడ్డుమీద పడేస్తా అంటే ఇక్కడ చూస్తూ ఊకునేటోళ్లు ఎవ్వరు లేరు.

భుజం భుజం కలిపి మీతో కలిసి కొట్లాడుతం. 2400 కిలోమీటర్ల నమామీ గంగ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ ప్రభుత్వం రూ.20 వేల కోట్లు ఖర్చుపెడితే.. 55 కిలోమీటర్ల మూసీ ప్రాజెక్టుకు రేవంత్ రెడ్డి రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడ్తడట. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.4 వేల కోట్లతోని మూసీ శుద్ధి చేసేందుకు ఎస్టీపీ ప్రాజెక్టులు ప్రారంభించాం. అదేవిధంగా మూసీపై 540 కోట్లతో 15 బ్రిడ్జిలు మంజూరు చేసినం.

బీఆర్ఎస్ హయాంలో ఇదే ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్లు అవుతాయని లెక్కగట్టాం. కానీ ఒకేసారి పది రెట్లు ఎలా పెరిగింది? దీనికి సమాధానం చెప్పేటోడు లేడు. ఇండ్లు కూలగొడతామంటే తాము ఊరుకునేది లేదు. శంకర్‌నగర్‌లో ఇండ్లు కూలగొడుతున్నరట. రేవంత్ రెడ్డికి ఏమన్నా సిగ్గుంటే.. నిన్ననే హైకోర్టు చెప్పింది. ఇండ్లు కూలగొట్టదని. రేవంత్ రెడ్డి నువ్వు మొగోనివైతే ముందు ఆరు గ్యారంటీలు అమలు చేయ్. కాంగ్రెస్‌ళ్ల నలుగురు బ్రోకర్‌గాళ్లు వస్తరు.. మిమ్మల్ని విడగొట్టే ప్రయత్నం చేస్తరు. ఏ బ్రోకర్‌ను నమ్మొద్దు. మీ ఇళ్లను కాపాడుకోవాలంటే ఐక్యమత్యంతో ఉండాలి. మిమ్మల్ని ఎవరు ముడుతడో తామంతా చూస్తామని.. ఒక్క కాల్ కొడితే తామంతా ఒస్తాం. మీరు ఎంత గట్టిగ నిలబడితే.. మీ ఇండ్లు అంతే గట్టిగ నిలబడు తయ్. మున్సిపల్ ఎన్నికలప్పుడు ఓటుతో జాడిచ్చి కొట్టాలి. మీ హక్కులు మీ దగ్గర గుంజుకునే హక్కు ఎవరికీ లేదు. కేసీఆర్ మీకు అండగా ఉన్నడు. మీ ఇండ్లు పోకుండా చూసుకునే బాధ్యతా మాది. ఆర్‌బీఎక్స్ అని ఉంటే దానిని తుడిపేసి కేసీఆర్ అని రాయండి. ' అని కేటీఆర్ అన్నారు.

# మత విశ్వాసాల కంటే ప్రజల భద్రతే ముఖ్యం..

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులు జారీ చేసి కూల్చివేస్తున్నట్లు తెలిపారు. ఏదో ఒక ఘటన, ఓ వర్గం ఆరపణలతో కూల్చివేతలు అక్రమం అని భావించొద్దన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. మత విశ్వాసాలకన్నా ప్రజల భద్రతే ముఖ్యమని గతంలో పలు తీర్పుల్లోనూ స్పష్టం చేసినట్లుగా గుర్తు చేసింది. రోడ్లపై మతపరమైన కట్టడాలు తొలగింపును ధర్మాసనం సమర్థించింది.



# సమగ్రంగా డిజిటల్ కార్డుల సర్వేను చేపట్టాలి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డిజిటల్ కార్డుల జారీకి ఇంటింటి పరిశీలన చేపట్టి ప్రతీ కుటుంబానికి సంబంధిం చిన వివరాలను సమగ్రంగా పరిశీలించి ఈ నెల 8వ తేదీ వరకు పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు.

ఫ్యామి లీ డిజిటల్ కార్డుల సర్వే నగరాలు, పట్టణ ప్రాంతాల [illegible] ప్రతిపాదనలు, భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కారం, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు కోసం లబ్ధిదారుల ఎంపిక, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతి కుమారి సమీక్షించారు. డిజిటల్ కార్డుల జారీకి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రెండు గ్రామాల్లో ప్రయోగాత్మక సర్వేను నిర్వహించాలన్నారు. అర్బన్ నియోజకవ ర్గాలయితే రెండు వార్డులు, లేదా డివిజన్లు ఎంపిక చేయాలని సూచించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి ప్రతీ కుటుంబానికి సంబంధి ంచిన వివరాలను సమగ్రంగా పరిశీలించి ఈ నెల 8వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాల న్నారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పి ఈ నెల 15వ తేదీ నాటికి ప్రతీ మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ వర్తింపజేసి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు కె.గంగాధర్, పి.బెన్‌షాలోమ్, ఆర్డీవోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, డీపీవో సునంద, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారనున్న తెలంగాణ

- **ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క జపాన్‌లోని యమునాషిలో పర్యటించారు. ఈ సందర్భంగా యమునాషి గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని

సందర్శించారు.అక్కడ అత్యాధునిక గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రక్రియలు, బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థలు, ఇతర పునరుత్పాదక ఇంధన సాంకేతికతలపై కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి గ్రీన్ హైడ్రోజన్ హబ్ గా తెలంగాణ మారనుందని హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ టెక్నాలజీని నెలకొల్పేందుకు జపాన్ కి చెందిన యమునాషి కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ హరిత భవిష్యత్తు దిశగా అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో పుష్కలంగా నీటి వనరులు ఉన్నాయని, సోలార్ ప్లాంట్లకు అణువైన కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# విశ్రాంత ఐఏఎస్ అధికారిణి చందనా ఖాన్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఏపి లో విశిష్ట సేవలు అందించిన 1979 బ్యాచ్ ఐఏఎస్అ ధికారిణి చందనా ఖాన్ అనారోగ్య కారణాలతో తుదిశ్వాస విడిచారు.ఉమ్మడి ఎపిలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, సర్వశిక్ష అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు తదనంతర కాలంలోపర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగారాష్ట్రాంలో టూరిజం అ ఎనలేని కృషి చేశారు. %పశ్చిమమ బెంగాల్ కు చెందిన చందనా ఖాన్ ఏపీకేడర్ అధికారిణిగా రాజమండ్రి, శ్రీకాకుళం సబ్ కలెక్టర్ గా కెరీర్ ప్రారంభించి, కడప కలెక్టర్ గా.తనదైన ముద్ర వేసారు.



# మూసీకి పోటెత్తిన వరద..

- **జంటజలాశయాల గేట్లు ఎత్తివేత**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మూసీకి వరద పోటెత్తింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాలనుంచి జంటజలాశయాలకు వరద ఉధృతి పోటెత్తుతోంది. దీంతో అధికారులు జలాశయాల గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ రెండు జలాశయాల్లోకి 1750 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు అలర్ట్ ప్రకటించారు.మంగళవారం జలమండలి అధికారులు ఉస్మాన్‌సాగర్ 6 గేట్లను ఎత్తివేశారు. హిమాయత్‌సాగర్ ఒక గేట్ ఎత్తారు. ఉస్మాన్‌సాగర్ ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 1428 క్యూసెక్కులుగా ఉంది. దీంతో అధికారులు ఉస్మాన్‌సాగర్ 6 గేట్లను రెండుఫీట్ల మేర ఎత్తారు. హిమాయత్‌సాగర్ ఒక గేటు ఒక అడుగుమేర ఎత్తి 348 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జంట జలాశయాల నుంచి 1776 క్యూసెక్కుల వరదనీటిని మూసీనదిలోకి విడుదల చేస్తున్నారు. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో మూసీనదీపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

# రెండో టెస్టులో భారత్ అద్భుత విజయం

## బంగ్లాతో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్




**బలగం టీవీ, కాన్పూర్**

అసలు ఫలితం తేలుతుందా అనుకున్న కాన్పూర్ గ్రౌండ్‌లో భారత్ అద్భుతం చేసింది. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో అదరగొట్టి బంగ్లాపై రెండో టెస్టులో ఏడు వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దాంతో బంగ్లాతో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 2–0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.

95 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రోహిత్ సేన 3 వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. ఓపెనర్ జైస్వాల్ తన పవర్ హిట్టింగ్‌తో ఆకట్టుకున్నాడు. అన్ని ఫార్మాట్లకు తగ్గ క్రికెట్ స్ట్రోక్స్‌తో చెలరేగిపోతున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. 51 రన్స్ చేసి ఔటయ్యాడు. కోహ్లీ 29 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ (8), ఇక రెండో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (6) విఫలమయ్యారు. ఆ తర్వాత బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్ (51), విరాట్ కోహ్లీ (29 నాటౌట్) అద్భుతంగా రాణించారు. అయితే మరో మూడు పరుగులు అవసరం అన్న సమయంలో, యశస్వి జైస్వాల్ భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. ఆ తర్వాత రిషభ్ పంత్‌తో (4 నాటౌట్) కలిసి కోహ్లీ మరో వికెట్ కూడా పడనీయకుండానే జట్టును గెలిపించారు.

అంతకుముందు ఆట చివరి రోజు ఉదయం బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 146 రన్స్‌కు ఆలౌటైంది. భారత బౌలర్లలో బుమ్రా, అశ్విన్, జడేజాలు చెరి మూడేసి వికెట్లు తీసుకున్నారు.అయిదో రోజు 26 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్.. కేవలం 146 రన్స్‌కే ఆలౌటైంది. దీంతో ఇండియాకు స్వల్ప టార్గెట్ దక్కింది.

మ్యాచ్ తొలి రోజు కేవలం 35 ఓవర్లే పడగా, వర్షం కారణంగా మ్యాచ్ రెండు రోజుల పాటు రద్దయ్యింది. దీంతో ఫలితం ఎటువైపు వస్తుందో అన్న తరుణంలో బంగ్లాను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆలౌట్ చేసి రోహిత్ సేన చెలరేగిపోయింది.

మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లా 233 పరుగులు చేయగా, అందులో భారత్ 285/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఇక ఈ విజయంతో స్వదేశంలో వరుసగా 18వ సిరీస్‌ను భారత్ గెలిచినట్టు అయింది. యశస్వి జైస్వాల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా, రవిచంద్రన్ అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ సిరీస్ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న టీమ్ ఇండియా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. రాబోయే ఎనిమిది టెస్టుల్లో మరో మూడు గెలిచినా భారత్ టాప్–2లో ఉండి ఫైనల్‌కు చేరడం ఖాయం.



# షకీబ్‌కు విరాట్ 'ఫేర్‌వెల్' గిఫ్ట్

**బలగం టీవీ, కాన్పూర్**

బంగ్లాదేశ్ స్టార్ ఆల్ రౌండర్ షకిబ్ అల్ హసన్ భారత్‌తో తన చివరి టెస్టు మ్యాచ్ ఆడేశాడు. అయితే ఈ వేదికలో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ షకిబ్‌కు ఓ ప్రత్యేక బహుమతి అందించాడు. ఇరు జట్ల ఆటగాళ్లు మాట్లాడుకుంటున్న సమయంలో షకిబ్ దగ్గరకు వెళ్లి తాను సైన్ చేసిన బ్యాట్‌ను అతడికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఇటీవల టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన షకిబ్, రానున్న ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీతో వన్డే క్రికెట్‌కు చెప్పనున్నట్లు తెలిపాడు. తన సొంత మైదానం మీర్పూర్‌లో చివరి టెస్టు ఆడాలనుకుంటున్నాడు. దీనికి బీసీబీ అంగీకరించిందంటూ షకీబ్ వెల్లడించాడు.

# డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరువగా భారత్..

- **మూడు గెలిస్తే చాలు**

**బలగం టీవీ, కాన్పూర్**

బంగ్లదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమ్‌ఇండియా 2–0 పాయింట్లతో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్ విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియా తమ అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. అంతేకాకుండా వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్(డబ్ల్యూటీసీ)కు చేరువైంది.


డబ్ల్యూటీసీలో భారత్ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడింది. అందులో 8 విజయాలు, 2 ఓటములు, ఒక డ్రా ఉన్నాయి. ప్రస్తుతం భారత జట్టు (పీసీటీ 74.27)తో టాప్ పొజిషన్‌లో ఉంది. మరోవైపు జూన్‌లో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్ కంటే ముందు టీమ్‌ఇండియా ఎనిమిది టెస్టులు ఆడనుంది. వాటిలో మూడింట గెలిచినా కూడా ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండానే భారత జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్, అలాగే నవంబర్‌లో ఆస్ట్రేలియా వేదికగా బోర్డర్–గావస్కర్ ట్రోఫీ (ఐదు టెస్టులు) ప్రారంభంకానున్నాయి. స్వదేశంలో కివీస్‌తో జరిగే సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేస్తే మాత్రం ఆస్ట్రేలియా సిరీస్‌తో సంబంధం లేకుండానే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుంది.

# అమ్మాయిలు కూడా కప్ కొట్టేనా..?



- **రేపటి నుంచి మహిళల టీ20 ప్రపంచకప్ షురూ..**
- **అక్టోబర్ 4 నుంచి వేట మొదలు పెట్టనున్న భారత్**



**బలగం టీవి, హైదరాబాద్**

టీ 20 పురుషుల వరల్డ్ కప్‌లో టీమ్ ఇండియా విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు అమ్మాయిల వంతు వచ్చింది. రేపటి (గురువారం) నుంచి మహిళల టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు ఏ ఫార్మాట్‌లోనూ భారత మహిళల జట్టు ప్రపంచ కప్ సాధించలేదు. కానీ ఈ మెగా టోర్నీలో తొలి ట్రోఫీ నిరీక్షణకు తెరదించాలని భారత మహిళల జట్టు ఎంతో ఉత్సాహంగా సిద్ధమవుతోంది.

2020లో మొదటి సారి టీ 20 వరల్డ్ కప్ ఫైనల్ చేరింది భారత్. కానీ అనూహ్యంగా ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. ఆసీస్ మహిళల జట్టు ఇప్పటివరకు ఆరు సార్లు విశ్వ విజేతగా నిలిచింది. అందుకే ఈ సారి కూడా ఆ జట్టు ఫేవరెట్‌గానే బరిలోకి దిగనుంది.అయితే భారత జట్టు కూడా ఈ సారి మునుపెన్నడూ లేనంత బలంగా, ఆల్‌రౌండ్ నైపుణ్యంతో బరిలోకి దిగుతోంది.

### ఆరు సార్లు ఆసిసే..

ఇప్పటి వరకు 8 సార్లు మహిళల టీ20 వరల్డ్ కప్‌లు జరిగాయి. ఆస్ట్రేలియా ఆరుసార్లు 2010, ఇంగ్లాండ్, వెస్టిండీస్, చెరొక్కసారి ట్రోఫీని గెలుచుకున్నాయి.

### ఈ సారి టోర్నీ ఫార్మట్ ఎలా అంటే..?

ఇక ఈ సారి టోర్నీలో మొత్తం 10 జట్లు పోటీ పడుతున్నాయి. ఐదేసి జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి, మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్‌లో తలపడతాయి. లీగ్ దశలో రెండు గ్రూప్‌ల నుంచి టాప్ రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. ఈ సారి టీ20 ప్రపంచకప్‌నకు దుబాయ్, షార్జా మైదానాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ నెల 20న దుబాయ్‌లో ఫైనల్ పోరు జరగనుంది.

గ్రూప్ 'ఏ'లో ఉన్న భారత్‌కు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంకలు గట్టి పోటీనిచ్చే అవకాశం ఉంది. అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌తో వరల్డ్ కప్ వేటను మొదలెట్టనుంది. ఇక గ్రూప్–ఎలోనే భారత్, పాకిస్థాన్ ఉన్నాయి. ఈ రెండు జట్లు ఈ నెల 6న తలపడనున్నాయి.

# మెట్లపై నుంచి కిందపడి యువ క్రికెటర్ మృతి





**బలగం టీవి, కాన్పూర్**

బెంగాల్‌కు చెందిన క్రికెటర్ అసిఫ్ హొసేన్(28) అనుకోకుండా దుర్మరణం చెందాడు. సొంత ఇంటి మెట్ల పైనుంచి ప్రమాదవశాత్తూ కింద పడిన అతడు ప్రాణాలు కోల్పోయాడు. అసిఫ్ మరణవార్త తెలిసిన క్రికెటర్లు అతడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు.

వివరాల్లోకెళ్తే బెంగాల్‌లోని ఇంట్లో అసిఫ్ సోమవారం మెట్ల పైనుంచి జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అయితే.. అప్పటికే అసిఫ్ మరణించాడని వైద్యులు చెప్పారు. దాంతో అసిఫ్ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దేశవాళీలో నిలకడగా రాణించిన అసిఫ్ బెంగాల్ టీ20 లీగ్‌లోనూ దంచి కొట్టాడు. ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన అతడు 37 బంతుల్లోనే అర్ధ శతకంతో చెలరేగాడు. ఓ మ్యాచ్‌లో 99 పరుగులతో సత్తా చాటిన అతడు సీనియర్ జట్టుకు ఆడడంపై దృష్టి పెట్టాడు. కానీ, అనుకోకుండా అసిఫ్ మృత్యుఒడికి చేరడం తమను ఎంతో బాధిస్తోందని సహచరులు అంటున్నారు. క్రికెటర్ అవ్వడం కోసం అహర్నిశలు శ్రమించి.. ఉజ్వల భవిష్యత్తును ఊహించిన అతడి అకాల మరణం పట్ల బెంగాల్ క్రికెట్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

**తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ 'బతుకమ్మ' ప్రకృతిని ఆరాధిస్తూ, ఆనందం పంచుకుంటూ జరుపుకునే ఈ పండుగలో చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసి ఆనందంగా ఆడిపాడతారు.**
**రంగురంగుల పూలతో తెలంగాణ గ్రామాలు మరింత శోభాయమానంగా మారతాయి.**
**తెలుగులో 'బతుకు' అంటే జీవితం, 'అమ్మ' అంటే తల్లి. ఈ రెండు పదాల మిశ్రమమే బతుకమ్మ పండగ. ఈ పండుగ మహాలయ అమావాస్య లేదా భాద్రపద అమావాస్యనాడే ప్రారంభమవుతుంది.**
**దీనిని 'పేత్ర అమావాస్య' అని కూడా అంటారు.**

**నేటి నుంచి బతుకమ్మ సంబరాలు**



బలగం టీవి, హైదరాబాద్

బతుకమ్మ సంబరాలు నేటి నుంచి ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగియనుంది. యువతులు, మహిళలు ఆడుతూ పాడుతూ చేసుకునే పండుగ బతుకమ్మ. ఇది ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగిపొర్లే సమయంలో ఈ పండగ వస్తుంది. భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు కొనసాగే ఈ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ఆడపడుచులు సిద్ధమయ్యారు.

'బతుకమ్మ' పండుగను తెలంగాణా రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

**బతుకమ్మ పండుగ విశిష్టత**

సెప్టెంబరు, అక్టోబరు నెలలు తెలంగాణ ప్రజలకు పండుగల నెలలు. నెలలలో రెండు పెద్ద పండుగలు జరపబడతాయి. ఈ పండుగలకు కనీసం పదిహేను రోజులు అటువైపు, ఇటువైపు అంతా పండుగ సంబరాలు, కుటుంబ కోలాహలాలు, కలయకలతో నిండిపోయుంటుంది. ఈ పండుగలలో ఒకటి 'బతుకమ్మ పండుగ', మరియొకటి దసరా (విజయ దశమి). అయితే బతుకమ్మ పండుగ మాత్రం, తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండుగ. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక.

రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు అనే పాటలను పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వ బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చిన గత వెయ్యి ఏళ్లుగా బతుకమ్మను ఇక్కడి ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారు. ఎన్నో చరిత్రలు, పురాణాలు మేళవిస్తారు.ఎన్నో చారిత్రక పాటలు పాడుతారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల వెనుక ఉండే మర్మం ఇదే.

ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజులలో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు రంగు రంగులలో ఆరుబయలలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నంది వర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. సీతాఫలాలు (షిత్పాలా పండ్లు అంటారు) కూడా ఈ సమయంలో ఒక పెద్ద ఆకర్షణ. సీతాఫలాన్ని పేదవాని ఆపిల్ అంటారనేది తెలిసినదే. అలాగే జొన్న పంట కోతకు సిద్ధంగా తలలూపుతూ ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు

తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది. ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరుణంలో బతుకమ్మ ఖండాంతరాలు దాటి ప్రాధాన్యత మరింతగా పెరిగిపోయింది.

తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్ డమ్(టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో చేనేత బతుకమ్మ దసరా సంబరాలు 2023

**పండుగ కథ**

తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పరిపాలించేవారు. వారి వద్ద వేములవాడ చాళుక్యలు సామంతులుగా ఉండేవారు. చోళులకు, రాష్ట్రకూటులకు యుద్ధం జరిగినప్పుడు ఈ చాళుక్యలు రాష్ట్రకూటులకు మద్దతుగా నిలిచారు. క్రీస్తు శకం 973లో ఈ చాళుక్యరాజైన తైలపాడు రాష్ట్రకూటులకు చివరి రాజుగా వ్యవహరించిన కర్కుడిని హతంచేసి కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని నెలకొల్పాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతాన్ని తైలపాడు రాజే పరిపాలించేవాడు. క్రీస్తు శకం 997లో తైలపాడు మరణించడంతో అతని కుమారుడైన సత్యాస్రాయుడు రాజపీఠాన్ని అధిష్టించాడు. అప్పటి వేములవాడ (ప్రస్తుత కరీంనగర్ జిల్లా) లో ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వర ఆలయం ఉండేది. ఆపదల్లో ఉండేవారికి రాజరాజేశ్వరి అండగా ఉంటుందని అప్పటి ప్రజలు నమ్మేవారు. ప్రజలే కాదు చోళరాజు పరాంతక సుందరచోళా కూడా రాష్ట్రకూటుల నుంచి ఆపద తలెత్తినప్పుడు రాజరాజేశ్వరికి భక్తుడిగా మారిపోయాడు. రాజరాజేశ్వరే తనను కాపాడిందని నమ్మిన పరాంతక సుందర చోళ తన కుమారుడికి రాజరాజ అని నామకరణం చేశాడు. ఆ రాజరాజ చోళానే క్రీస్తు శకం 985 నుంచి 1014 వరకు రాజ్యాన్ని పరిపాలించాడని చరిత్ర చెబుతోంది. అతని కుమారుడైన రాజేంద్రచోళ సత్యాస్రాయపై జరిపిన యుద్ధానికి సేనాధిపతిగా వ్యవహరించి విజయం సాధించాడు. ఆ విజయానికి గుర్తుగా రాజేశ్వరి ఆలయాన్ని కూల్చేసి అందులోని భారీ శివలింగాన్ని తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. తన కొడుకు ఇచ్చిన శివలింగం కోసం క్రీస్తు శకం 1006లో ఏకంగా ఓ ఆలయ నిర్మాణాన్ని చేపట్టాడు రాజరాజ చోళ. సా.శ 1010లో నిర్మాణం పూర్తయ్యాక భారీ శివలింగాన్ని బ్రిహదేశ్వరాలయంలో ప్రతిష్ఠించాడు. తమ రాజ్యంపై దాడి చేసి దోచుకున్న సొమ్ముతోనే బ్రిహదేశ్వరాలయ నిర్మాణాన్ని చేపట్టినట్టు కూడా తమిళ శిలాశాసనాల్లో చోళ రాజులు చెప్పారు. ఇప్పటికీ వేములవాడలోని భీమేశ్వరాలయ శివలింగానికి, బ్రిహదేశ్వరాలయంలోని శివలింగానికి మధ్య సారూప్యతను చూడచ్చు. వేములవాడ నుంచి శివలింగాన్ని పార్వతి నుంచి వేరుచేసి తంజావూరుకు తరలించినందుకు తెలంగాణ ప్రజల మనసు కలచివేసింది. బృహదమ్మ (పార్వతి) నుంచి శివలింగాన్ని వేరుచేసినందుకు గాను, తమ దు:ఖాన్ని చోళులకు తెలియజేస్తూ మెరూ పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మను నిర్వహించడం మొదలుపెట్టారు తెలంగాణవాసులు. అలా ప్రతి ఏడాది బతుకమ్మను జరపడం ఆనవాయితీగా మార్చుకున్నారు. దాదాపు 1000 సంవత్సరాల నుంచి బతుకమ్మను తెలంగాణవాసులు జరుపుకుంటున్నారు. బతుకమ్మ పేరు కూడా బృహదమ్మ నుంచి వచ్చినదే. బతుకమ్మ సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటపాటలాడి పూలను నీటిలో వదులుతారు. శివుడు లేని పార్వతి గురించి పాటలగా పాడుతూ బతుకమ్మను జరుపుకుంటున్నారు తెలంగాణ వాసులు.

బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి, భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడుతుంది. ఈ సంబరాలు జరుపుకునే వారం అంతటా స్త్రీలు "బొడ్డెమ్మ" (మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మ) ను బతుకమ్మతో పాటూ చేసి నిమజ్జనం చేస్తారు.

**తొమ్మిది రోజుల బతుకమ్మ నైవేద్యాలు**

9 రోజులపాటు ప్రతిరోజూ ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువతీయువకులు పాల్గొంటారు. చివరిరోజును సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

**ఎంగిలి పూల బతుకమ్మ: మహా అమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.**

**అటుకుల బతుకమ్మ: ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.**

**ముద్దపప్పు బతుకమ్మ: ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.**

**నానే బియ్యం బతుకమ్మ: నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.**

**అట్ల బతుకమ్మ: అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.**

**అలిగిన బతుకమ్మ: ఈరోజు ఆశ్వయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు.**

**వేపకాయల బతుకమ్మ: బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.**

**వెన్నముద్దల బతుకమ్మ: నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.**

**సద్దుల బతుకమ్మ: ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు.**

**పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం. తొమ్మిదిరోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు.**

## రవీంద్ర భారతిలో ప్రత్యేక కార్యక్రమాలు

బతుకమ్మ పండుగ నేపథ్యంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో 9వ తేదీ వరకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. 10వ తేదీన ట్యాంక్ బండ్‌పై వేడుకలు, లేజర్ షో ఉంటుంది. ఈసారి అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్ బండ్ వరకు వెయ్యి బతుకమ్మలతో భారీ ర్యాలీ తీయనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు కూడా హాజరుకానున్నారు.

